సాక్షి
ఖమ్మం
సోమవారం । 26 । ఆగస్టు । 2024



నివురుగప్పిన నిప్పలా..

సత్తుపల్లి మండలం బేతుపల్లి, బి.గంగారం గిరిజన సొసైటీ భూముల్లో నెలకొన్న వివాదం నివురుగప్పిన నిప్పలా మారుతోంది. 8లో



నేడు శ్రీ కృష్ణాష్టమి..

శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని సోమవారం ఘనంగా నిర్వహించేందుకు జిల్లాలోని పలు గ్రామాలు, ఆలయాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. 8లో



వాతావరణం

జిల్లాలో సోమవారం అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. మధ్యాహ్నం తర్వాత ఎండ ప్రభావం పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నేడు మంత్రి పొంగులేటి పర్యటన



ఖమ్మంవన్‌టౌన్‌: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సోమవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10.30 గంటలకు పాల్వంచలో ప్రెస్‌ క్లబ్‌ భవనాన్ని ప్రారంభిస్తారు. ఆ తర్వాత కొత్తగూడెంలోని మేదర బస్తీలో కౌన్సిలర్‌ పూర్ణ కుటుంబాన్ని పరామర్శిస్తారు. మధ్యాహ్నం 2.45 గంటలకు ఖమ్మం నగరంలోని ఆల్లీపురం కొత్తగూడెంలో రామ సంగం, సహకారనగర్‌లో కిలారు రామకృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. సాయంత్రం 4 గంటలకు కూసుమంచి క్యాంపు కార్యాలయంలో గీత కార్మికులకు కాటమయ్య రక్ష కిట్లను పంపిణీ చేస్తారు. రాత్రి 8 గంటల వరకు ప్రజలకు, నాయకులకు, అభిమానులకు అందుబాటులో ఉంటారని క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్‌ దయాకర్‌రెడ్డి తెలిపారు.

పీజీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం సహకారనగర్‌ : నగరంలోని కాకతీయ యూనివర్సిటీ పీజీ కళాశాలలో ఎంఏ ఎకనామిక్స్‌, ఇంగ్లిష్‌, ఎం. కాం, మాస్టర్‌ ఆఫ్‌ సోషల్‌ వర్క్‌ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ చేకూరి రవికుమార్‌ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల జరిగిన ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులు ఈనెల 27 నుంచి ప్రారంభం కానున్న వెబ్‌ ఆప్షన్స్‌లో తమ కళాశాలను మొదటి ప్రాధాన్యతగా ఎంచుకుని ప్రవేశాలు పొందాలని సూచించారు. ఎం.కాం కోర్సులో 80, ఎంఏ ఎకనామిక్స్‌, ఇంగ్లిష్‌, ఎంఎస్‌డబ్ల్యూ కోర్సుల్లో ఒక్కో విభాగంలో 50 సీట్ల చొప్పున మొత్తం 150 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. వివరాలకు 93464 43578, 98498 62802 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

కానిస్టేబుల్‌ దంపతులకు బంగారు పతకం



గోల్డ్‌మెడల్‌ సాధించిన దంపతులు

ఖమ్మంరూరల్‌: హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన ఎన్‌ఎండీసీ మారథాన్‌లో మండలంలోని మద్దులపల్లికి చెందిన రేగళ్ల గోపి, లక్ష్మి కానిస్టేబుల్‌ దంపతులు బంగారు పతకం సాధించారు. గోపి 42.2 కిలో మీటర్ల పరుగు పందెంలో 4.17 గంటల్లో, లక్ష్మి 21.1 కిలోమీటర్ల దూరాన్ని 2.38 గంటల సమయంలో చేరుకుని విజయం సాధించారు. వీరిద్దరూ గతంలో పలు మారథాన్‌ పోటీల్లో పాల్గొని విజయం సాధించారు. గోపి గన్‌మెన్‌గా పని చేస్తుండగా, లక్ష్మి తిరుమలాయపాలెం పోలీస్‌ స్టేషన్‌లో రిసెప్షనిస్ట్‌గా పని చేస్తున్నారు. ఈ పోటీల్లో పలు రాష్ట్రాల నుంచి ఎంతోమంది క్రీడాకారులు పాల్గొనగా మద్దులపల్లికి చెందిన దంపతులిద్దరూ గోల్డ్‌మెడల్‌ సాధించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

అలరించిన సినీ సంగీత లహరి



పాటలు పాడుతున్న గాయకులు

ఖమ్మంగాంధీచౌక్‌: శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా స్వర సుధా మ్యూజిక్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి స్థానిక భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహించిన సినీ సంగీత లహరి కార్యక్రమం ప్రేక్షకులను అలరించింది. వివిధ ప్రాంతాలకు చెందిన గాయనీ, గాయకులు మధుర గీతాలను ఆలపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు డాక్టర్‌ వనం కృష్ణవేణి అధ్యక్షత వహించగా, సంస్థ గౌరవాధ్యక్షుడు పారుపల్లి సురేష్‌, డాక్టర్‌ టి.వాసుదేవ్‌, డాక్టర్‌ నాగబత్తిని రవి, హరి వెంకట లక్ష్మీ ప్రసాద్‌ బాబు, నున్నా పుల్లారావు, ప్రముఖ వ్యాఖ్యాత, కమేడియన్‌ మొగిలి గుణకర్‌, పాదిలి వెంకటేశ్వర్లు, విద్యాసాగర్‌, గిరిజా దేవి, శ్రీనివాసరావు, శశాంక, కాండూరి సరస్వతీ కుమార్‌, కొడుమూరి లక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రచయిత, రిటైర్డ్‌ లెక్చరర్‌ చిమ్మపుడి శ్రీరామమూర్తి, ఎంవీఎస్‌ఎన్‌ ప్రసాద్‌, మధుర గానమౌళి డాక్టర్‌ శ్రీనివాస దాస భాస్కర్‌ను ఘనంగా సన్మానించారు.

సాంకేతికత వైపే మొగ్గు..





ఖమ్మంలోని ఎస్‌ఆర్‌ అండ్‌ బీజీఎన్‌ఆర్‌ డిగ్రీ కళాశాల


ఖమ్మంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల

- డిగ్రీ కోర్సుల్లో అరకొరగానే ప్రవేశాలు
- ఎస్‌ఆర్‌ అండ్‌ బీజీఎన్‌ఆర్‌ కళాశాలలో కాస్త ఓకే..
- మిగతా ప్రభుత్వ కళాశాలల్లో సగం మేర ఖాళీ
- నాలుగు ఫేస్‌ల్లో అడ్మిషన్లు నిర్వహించినా కానరాని ఫలితం

రోజురోజుకూ దూసుకెళ్తున్న సాంకేతిక యుగంలో సంప్రదాయ కోర్సుల వైపు విద్యార్థులు దృష్టి సారించడం లేదా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పూర్తిగా డిగ్రీ కోర్సులను విడిచిపెట్టేశారా అంటే కాదనే చెప్పాలి. కానీ ప్రవేశాలు మాత్రం అరకొరగానే నమోదవుతున్నాయి. ఇంజనీరింగ్‌, పారా మెడికల్‌ కోర్సుల వంటి తక్షణ ఉపాధి లభించే కోర్సుల వైపు విద్యార్థులు ఎక్కువగా ఆసక్తి కనబరుస్తుండడం ఇందుకు కారణమని విద్యావేత్తలు చెబుతున్నారు.

– ఖమ్మం సహకారనగర్‌





ఐదు కళాశాలల్లో కోర్సుల వారీగా ప్రవేశాల వివరాలు..

కోర్సు	మొత్తం సీట్లు	భర్తీ సీట్లు	ఖాళీలు
బీఏ	1,020	688	332
బీకాం	840	629	211
బీఎస్సీ (ఫిజికల్‌సైన్స్‌)	540	264	276
బీఎస్సీ(లైఫ్‌సైన్స్‌)	660	315	345
బీబీఏ (బ్యాచ్‌లర్‌ ఆఫ్‌ బిజినెస్‌ అడ్మినిస్ట్రేషన్‌)	60	50	10
బీసీఏ (బ్యాచ్‌లర్‌ ఆఫ్‌ కంప్యూటర్‌ అప్లికేషన్‌)	60	55	05
మొత్తం	3,180	2,001	1,179

ప్రవేశాలు పర్వాలేదు



జిల్లాలోని ఐదు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రథమ సంవత్సరం అడ్మిషన్లు పర్వాలేదు. గతం కంటే విద్యార్థులు ప్రభుత్వ కాలేజీల వైపు మొగ్గు చూపారు. ప్రభుత్వ కళాశాలల్లో మెరుగైన సౌకర్యాలు.. అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉండడమే ఇందుకు కారణమని చెప్పొచ్చు.

– ఎం.సుబ్రహ్మణ్యం, దోస్త్‌ కన్వీనర్‌, ఖమ్మం

1,179 సీట్లు ఖాళీ..

దోస్త్‌ (డిగ్రీ ఆన్‌లైన్‌ సర్వీసెస్‌ తెలంగాణ) ద్వారా డిగ్రీ ప్రథమ సంవత్సరం కోర్సుల్లో ప్రవేశాలు కల్పించారు. జిల్లాలో ఐదు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉండగా.. వీటిలో అన్ని కోర్సులు కలిపి 3,180 సీట్లు ఉన్నాయి. ఈ ఏడాది 2,001 మంది మాత్రమే చేరగా 1,179 సీట్లు మిగిలిపోయాయి. మూడు విడతలుగా అవకాశం కల్పించినా.. ప్రవేశాలు ఆశించిన స్థాయిలో జరగలేదు. దీంతో స్పెషల్‌ ఫేస్‌ కింద సైతం దరఖాస్తులను ఆహ్వానించినా స్పందన అంతంతమాత్రమే.

ఎస్‌ఆర్‌అండ్‌ బీజీఎన్‌ఆర్‌కే మొగ్గు

జిల్లాలో ఐదు పభుత్వ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. ఇందులో జిల్లా కేంద్రంలోని ఎస్‌ఆర్‌ అండ్‌ బీజీఎన్‌ఆర్‌ కాలేజీకి అటానమస్‌ హోదాతో పాటు న్యాక్‌ ఏ ప్లస్‌ ప్లస్‌ గ్రేడ్‌ ఉండడంతో ఉమ్మడి జిల్లా విద్యార్థులే కాక మహబూబాబాద్‌, సూర్యాపేట జిల్లాల విద్యార్థులు సైతం ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఇక జిల్లాలో ఉన్న ఏకైక మహిళా డిగ్రీ కళాశాలలో సైతం ఆశించిన స్థాయిలో ప్రవేశాలు నమోదు కాలేదు. మధిర, సత్తుపల్లి, నేలకొండపల్లి కళాశాలల్లో సగం సీట్లు కూడా నిండకపోవడం గమనార్హం.

వృత్తి విద్యాకోర్సులపై ఆసక్తి..

ఇంటర్‌మీడియెట్‌ పూర్తికాగానే ఇంజనీరింగ్‌, పారా మెడికల్‌ వంటి తక్షణ ఉపాధి లభించే వృత్తి విద్యా కోర్సులవైపే విద్యార్థులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారని తెలుస్తోంది. ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ చదివిన విద్యార్థులు అధిక శాతం ఇంజనీరింగ్‌లో చేరితే త్వరితగతిన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయనే భావనతో అటే అడుగులు వేస్తున్నారు. ఇక బైపీసీతో ఇంటర్‌ చేసిన వారు పారా మెడికల్‌ కోర్సులను ఎంచుకుంటున్నారని పలువురు విశ్లేషిస్తున్నారు.

సైన్స్‌లో గ్రూప్‌ల్లో కొంత తగ్గారు



సైన్స్‌ గ్రూప్‌ల్లో ప్రవేశాలు కాస్త తగ్గినా.. మిగతావి గతం కంటే మెరుగ్గానే ఉన్నాయి. మాది అటానమస్‌ కళాశాల కావడంతో విద్యార్థులు ఆసక్తి కనబర్చారు. ఇంజనీరింగ్‌, పారా మెడికల్‌ కోర్సుల వైపు దృష్టి సారించడంతో సైన్స్‌ కోర్సుల్లో ప్రవేశాలు తగ్గినట్లు తెలుస్తోంది.

– మహ్మద్‌ జకీరుల్లా, ఎస్‌ఆర్‌ అండ్‌ బీజీఎన్‌ఆర్‌ డిగ్రీ కళాశాల, ఖమ్మం

అశాస్త్రీయ భావాలు తొలగించాలి

జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

ఖమ్మం సహకారనగర్‌ : సమాజంలో పేరుకుపోయిన అశాస్త్రీయ భావనలను తొలగించేందుకు, శాస్త్రీయ దృక్పథం పెంచేందుకు జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) కృషి చేస్తోందని సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కోయ వెంకటేశ్వరరావు, కోశాధికారి ఆర్‌.వరప్రసాద్‌ అన్నారు. నగరంలోని కవితా మెమోరియల్‌ డిగ్రీ కాలేజీలో ఆదివారం సంఘం జిల్లా మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శాస్త్రీయ దృక్పథాన్ని ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలన్నారు. చెకుముఖి టాలెంట్‌ టెస్ట్‌ ద్వారా ప్రతి ఏటా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో మూఢ నమ్మకాలు పెట్రేగిన సమయంలో వాటి నిర్మూలనకు జేవీవీ కార్యకర్తలు కృషి చేస్తున్నారని చెప్పారు. సంఘం రాష్ట నాయకులు అలవాల నాగేశ్వరరావు, మల్లెంపాటి వీరభద్రరావు తదితరులు మాట్లాడగా జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రామారావు ప్రవేశ పెట్టిన నివేదికను ప్రతినిధులు ఆమోదించారు.

జిల్లా కమిటీ ఎన్నిక..

జేవీవీ జిల్లా మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వి.మోహన్‌, ప్రధాన కార్యదర్శిగా కె.రామారావు, కోశాధికారి గా టి.శివన్నారాయణ ఎన్నికయ్యారు. జిల్లా గౌరవాధ్యక్షుడిగా మల్లెంపాటి వీరభద్రరావు, వంజాకుల లక్ష్మీనారాయణ, ఎం.సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా తాతా రాఘవయ్య, వి.సునంద, నారాయణ, కోమటి లింగమూర్తి, ఎస్‌.వి. రమేష్‌, పి.రామకృష్ణ, జిల్లా కార్యదర్శులుగా సీహెచ్‌ భాస్కర్‌రెడ్డి, కె.వెంకటేష్‌, డాబాస్కో, బి.ప్రవీణ్‌, రాజయ్య, వి.సుజాత ఎన్నికయ్యారు. సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ కన్వీనర్‌గా ఎ.నాగేంద్రం, విద్య సబ్‌ కమిటీ సభ్యులుగా వెంకటేశ్వర్లు, ఆరోగ్య కమిటీకి డాక్టర్‌ సి.భారవి, సమత కమిటీకి కె.రాములమ్మ, కల్చరల్‌ కమిటీకి పి.సీతారామారావు, చెకుముఖికి ఎల్‌.వి. రెడ్డి, మీడియా కమిటీకి నామా పురుషోత్తం, లీగల్‌కు ఎస్‌వీఆర్‌ పురుషోత్తమరావు కన్వీనర్లుగా ఎన్నికయ్యారు.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి

పాల్వంచరూరల్‌: పాల్వంచ మండల పరిధిలోని కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. డ్యామ్‌ సమీపం నుంచి జలాశయాన్ని, డీర్‌ పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సరదాగా గడిపారు. 558 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించగా, వైల్డ్‌లైఫ్‌ శాఖ రూ.20,175 ఆదాయం, 250 మంది బోటు షికారు చేయగా, టూరిజం కార్పొరేషన్‌ సంస్థకు రూ.14,340 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

బీజేపీ సభ్యత్వం ప్రతీ ఇంటికి చేరాలి

మాజీ ఎమ్మెల్సీలు సుధాకర్‌రెడ్డి, రామచందర్‌రావు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి

ఖమ్మం మామిళ్లగూడెం : బీజేపీ సభ్యత్వ నమోదు ప్రతీ ఇంటికి చేరాలని మాజీ ఎమ్మెల్సీలు పొంగులేటి సుధాకర్‌రెడ్డి, రామచందర్‌ రావు అన్నారు. ఖమ్మంలోని ఓ హోటల్‌లో ఆదివారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యశాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏ పార్టీకైనా కార్యకర్తలే బలమని అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రవేశ పెట్టిన పథకాలు మారుమూల గ్రామాల్లోకి సైతం వెళ్లాయని చెప్పారు. రుణమాఫీ విషయంలో కాంగ్రెస్‌పై రైతులు పూర్తి వ్యతిరేకంగా ఉన్నారని తెలిపారు. తెలంగాణలో బీజేపీ 78 లక్షల ఓట్లతో కాంగ్రెస్‌ పార్టీకి దీటుగా నిలిచిందని అన్నారు. ఖమ్మం ఎంపీగా పోటీ చేసిన తాండ్ర వినోద్‌రావు మాట్లాడుతూ.. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లాలో పండుగలా నిర్వహిస్తామని ప్రకటించారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, నాయకులు సన్నె ఉదయ్‌ప్రతాప్‌, గెంటెల విద్యాసాగర్‌, శ్యామ్‌ రాథోడ్‌, నున్నా రవికుమార్‌, మార్తి వీరభద్ర ప్రసాద్‌, దనియాకులు వెంకటనారాయణయాదవ్‌, విజయారెడ్డి, సరస్వతి, నంబూరి రామలింగేశ్వ రావు, విజయరాజు, వెంకటగుప్తా, సత్యప్రసాద్‌, శ్రీనివాస్‌శర్మ పాల్గొన్నారు.

పల్లె పోరు ఎప్పుడో..?

- గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం ఎదురుచూపులు
- ఈసీ డ్రాఫ్ట్‌ నోటిఫికేషన్‌తో గ్రామాల్లో సందడి
- రిజర్వేషన్ల కేటాయింపుపై సందిగ్ధం



ఖమ్మంవన్‌టౌన్‌: గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం ఆశావహులు ఎదురుచూస్తున్నారు. గత ఫిబ్రవరిలో సర్పంచ్‌ల పదవీకాలం ముగియగా.. నాటి నుంచి గ్రామ సచివాలయాల పరిపాలన ప్రత్యేకాధికారుల చేతుల్లోకి వెళ్లింది. లోక్‌సభ ఎన్నికలు పూర్తి కాగానే రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధమవుతుందని అందరూ అనుకున్నా.. బీసీ జనాభా గణన అనంతరమే ఎన్నికలు నిర్వహిస్తామనే సంకేతాలు రావడంతో సర్పంచ్‌గా పోటీ చేయాలనుకునే వారి ఆశలపై నీళ్లు చల్లినట్టయింది. అయితే తాజాగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఓ అడుగు ముందుకేసింది. సెప్టెంబర్‌ 21వ తేదీ లోపు ఓటర్ల జాబితా ప్రచురణ, ఇతరత్రా పనులు ముగించాలని జిల్లా పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో త్వరలోనే ఎన్నికల నోటిఫికేషన్‌ వెలువడుతుందనే సంకేతాలు రావడంతో గ్రామాల్లో ఎన్నికల సందడి నెలకొంది.

ఆశావహుల ఆరాటం..

పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్‌ ఎప్పుడొస్తుందా అని ఆశావహులు అత్రుతగా ఎదురుచూస్తున్నారు. పాత రిజర్వేషన్లనే కొనసాగిస్తామని గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ప్రకటించింది. అయితే రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్‌ ప్రభుత్వం బీసీ జనాభా గణన తర్వాతే ఎన్నికలకు వెళ్తామని చెప్పడంతో రిజర్వేషన్లపై సందిగ్ధం నెలకొంది. గ్రామాల్లో ఆయా సామాజిక వర్గాల వారు పోటీకి ఉవ్విళ్లూరుతున్నారు. తమ గ్రామం ఏ వర్గానికి రిజర్వ్‌ అవుతుంది.. ఎవరు పోటీ చేయాలి అని ఇప్పటి నుంచే లెక్కలు వేసుకుంటున్నారు.

యువతను ఆకర్షించే ప్రయత్నాలు..

ఎన్నికలు త్వరలోనే ఉంటాయనే ఊహాగానాలతో పోటీ చేయాలనుకుంటున్న అభ్యర్థులు యువతను ఆకర్షించేందుకు ఇప్పటి నుంచే ప్రయత్నాలు ప్రారంభించారు. రానున్న వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామాల్లో యూత్‌ అసోసియేషన్లకు గణపతి విగ్రహాలను ఇప్పించడం, వేడుకలు ఘనంగా నిర్వహించడం వంటి చర్యలకు సమాయత్తం అవుతున్నారు. వినాయక మండపాల ఖర్చంతా తామే భరిస్తామంటూ మరి కొందరు సిద్ధమవుతున్నారు. కాగా, ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం డ్రాఫ్ట్‌ నోటిఫికేషన్‌తో సన్నద్ధం అవుతుండగా సర్పంచ్‌లు, గ్రామ వార్డుల రిజర్వేషన్‌లపై సందిగ్ధత నెలకొంది. సీఎం రేవంత్‌ రెడ్డి గతంలో బీసీ జన గణన అనంతరం ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పగా, తాజాగా ఓ సమావేశంలో రవాణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్‌ సైతం బీసీ జనాభా గణన అనంతరమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించారు. దీంతో ఇప్పుడే ఎన్నికలు ఉంటాయా.. మరికొన్ని రోజుల సమయం పడుతుందా అనే మీమాంసలో ఆశావహులు ఉన్నారు.

‘ముందస్తు’ ఫలితమేది?

- రైళ్లలో బెర్త్‌ బుక్‌ చేసుకున్నా దక్కని చోటు
- ముందుగానే ఆక్రమించుకుంటున్న ఇతరులు
- దూరప్రాంత రైళ్లలో నిత్యం ఇదే సమస్య
- టోల్‌ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేసినా స్పందన కరువు



ఖమ్మం రాపర్తి నగర్‌: ఖమ్మం మీదుగా విజయవాడ, సికింద్రాబాద్‌, బల్లార్షా మార్గాల మీదుగా నడిచే రైళ్లలో రిజర్వేషన్‌ ఉన్నా బెర్త్‌ దక్కించుకోలేని పరిస్థితి నెలకొంటోంది. రఫ్తీసాగర్‌, అహల్యనగర్‌, సంఘమిత్ర, అండమాన్‌, కోణార్క్‌ ఎక్స్‌ప్రెస్‌ రైళ్లలో ప్రయాణానికి నెలల ముందుగా రిజర్వేషన్‌ చేసుకున్నా వృథాప్రయాసే అవుతోందని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఖమ్మం వచ్చేసరికే ఆ బెర్త్‌ల్లో ఇతరులు ఉండడం.. ఫిర్యాదు చేద్దామంటే టీసీలు కానరాకపోవడమే కాక టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్‌ చేసినా పెద్దగా స్పందన ఉండడం లేదని చెబుతున్నారు.

నిత్యం వాగ్వాదాలు..

రైలులో దూరప్రాంతాలకు వెళ్లేవారు ముందస్తుగా రిజర్వేషన్‌ చేయించుకుంటారు. అయితే, ఖమ్మం లేదా ఇతర ప్రాంతాల్లో సదరు ప్రయాణికులు ఎక్కేసరికి ఆ బెర్త్‌లో జనరల్‌ టికెట్‌ కలిగిన వారు కనిపిస్తారు. రఫ్తీసాగర్‌, అహల్యనగర్‌, సంఘమిత్ర, అండమాన్‌, కోణార్క్‌ రైళ్లలో ఎక్కువగా బిహార్‌, మధ్యప్రదేశ్‌, రాజస్థాన్‌, ఉత్తర ప్రదేశ్‌, ఒడిశా రాష్ట్రాల నుంచి ప్రయాణికులు తమిళనాడు, కోల్‌కతా, కేరళ తదితర రాష్ట్రాల్లో ఉపాధి కోసం వెళ్తుంటారు. అయితే, ఆయా రైళ్లకు ముందు, వెనుక రెండేసి మాత్రమే జనరల్‌ బోగీలు ఉండడంతో వాటిలో జాగా లేక రిజర్వేషన్‌ బోగీల్లో కూర్చుంటున్నారు. తీరా రిజర్వేషన్‌ కలిగిన ప్రయాణికుడు వచ్చినప్పుడు కాస్త సీటు ఇచ్చి సర్దుకోవాలని చెబుతుండడంతో ముందుగా సీట్‌ బుక్‌ చేసుకున్నా ఫలితం ఏమిటనే ఆవేదన వ్యక్తమవుతోంది.

సర్దుకుపోండి..

రిజర్వేషన్‌ సీటు ఖాళీ లేకపోవడంతో ప్రయాణికులు రైల్వే ఎంక్వైరీ నంబర్లకు ఫోన్‌ చేస్తే రైల్వే పోలీసులు వచ్చి రిజర్వేషన్‌ లేని వారిని ఇతర బోగీల్లోకి పంపిస్తారు. అయితే, ఎక్కువ సార్లు పోలీసులు కూడా ‘సర్దుకుపోండి’ అని చెబుతుండడంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితి ఎదురవుతోందని ప్రయాణికులు అంటున్నారు. రెండు, మూడు నెలల క్రితం రిజర్వేషన్‌ చేయించుకున్నా తమకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం ఏంటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జనరల్‌ బోగీలు పెంచితేనే..

రాష్ట్రాల నడుమ రాకపోకలు సాగించే రైళ్లలో ఎక్కువగా రిజర్వేషన్‌ బోగీలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ముందు, వెనుకా ఒకటి, రెండు తప్ప ఎక్కువగా జనరల్‌ బోగీలు ఉండవు. తద్వారా అందరికీ ఆయా బోగీల్లో చోటు సరిపోక రిజర్వేషన్‌ బోగీల్లోకి ఎక్కుతున్నారు. ఫలితంగా రిజర్వేషన్‌ కలిగిన ప్రయాణికులకు ఇక్కట్లు ఎదురవుతున్నాయని తెలుస్తోంది. ఇకనైనా జనరల్‌ బోగీల సంఖ్య పెంచడంతో పాటు రిజర్వేషన్‌ కలిగిన వారు మాత్రమే నిర్దేశిత బోగీల్లో ఉండేలా పర్యవేక్షించాలనే వినతులు వెల్లువెత్తుతున్నాయి.

పట్టించుకోని టీసీలు

రిజర్వేషన్‌ బెర్త్‌ల విషయమై టీసీలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. రైలు బయలుదేరినప్పుడే ఏ బోగీ, ఏ బెర్త్‌లో ప్రయాణికులు ఎక్కడ ఎక్కుతారో జాబితా ఆధారంగా టీసీలకు తెలిసిపోతుంది. దీంతో రిజర్వేషన్‌ లేని ప్రయాణికులు సంప్రదిస్తే ఫలానా బెర్త్‌లో ఖమ్మంలో ప్రయాణికులు ఎక్కుతారని.. అప్పటివరకు తీసుకోవచ్చని చెబుతున్నట్లు సమాచారం. ఈక్రమంలో జరిమానా తీసుకుని రశీదు ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా ఖమ్మం లేదా ఇతర ప్రాంతాల్లో బెర్త్‌ కలిగిన వారు ఎక్కినప్పుడు ముందుగానే టీసీని సంప్రదించి బెర్త్‌ తీసుకున్న వారు తాము డబ్బు చెల్లించామని వాగ్వాదాలకు దిగడం పరిపాటిగా మారుతోంది.

క్లుప్తంగా

పండిట్లకు పదోన్నతులు కల్పించడం హర్షణీయం



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న సంఘం నేత

ఖమ్మం సహకారనగర్ : ఇటీవల పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులతో రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ (ఆర్‌యూపీపీ) ఆధ్వర్యంలో నగరంలోని జెడ్పీ హాలులో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్.జగదీష్, నర్సింహులు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. జిల్లాలో 228 మంది తెలుగు పండిట్లకు, 205 హిందీ ఉపాధ్యాయులకు పదోన్నతులు లభించడం హర్షణీయమని అన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు ఉమాదేవి, ప్రధాన కార్యదర్శి సుచరిత, నాయకులు భుక్యా హరి, రవికుమార్, పాపాలాల్ పాల్గొన్నారు .

నాగులవంచలో దొంగల సంచారం?

చింతకాని: మండలంలోని నాగులవంచ గ్రామంలో శనివారం అర్ధరాత్రి పలు వీధుల్లో దొంగలు సంచరించి ఇళ్ల తాళాలు పగులగొట్టినట్లు స్థానికులు తెలిపారు. ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో ఉన్న అంబటి లచ్చయ్య ఇంటి ఆవరణలో ఉన్న గడ్డపారను తీసుకుని పక్క వీధిలో ఉన్న బైరు నర్సింహ ఇంటి తాళాన్ని పగులగొట్టారు. ఆ సమయంలో నర్సింహ కుటుంబ సభ్యులు ఎవరూ ఇంట్లో లేరు. అలికిడి కావటంతో గడ్డపారను అక్కడే వదిలేసి ఇంటి వెనక్కి వెళ్లి సిగరెట్లు తాగిన ఆనవాళ్లు ఉన్నాయని తెలిపారు. అలాగే ప్రధాన రహదారిలో ఉన్న వెల్డింగ్ షాపు, బీసీ కాలనీలో కూడా ఓ ఇంటి తాళం పగులగొట్టినట్లు బాధితులు వాపోయారు. రెండు రోజులుగా గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి సమయాల్లో తిరుగుతున్నారని స్థానికులు తెలిపారు. దీనికి సంబంధించి ఆస్తినష్టం జరిగినట్లు పోలీసులకు ఎలాంటి సమాచారం అందనప్పటికీ పోలీసులు ఆయా ఇళ్లను ఆదివారం పరిశీలించారు. రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ ఏర్పాటు చేయటంతో పాటు నిఘా పెంచుతామని ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

సైబర్ మోసానికి గురైన వ్యక్తి

కల్లూరు: మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సైబర్ మోసానికి గురయ్యాడు. వివరాలిలా ఉన్నాయి.. మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన యువకుడి సెల్‌ఫోన్‌కు ఈ ఏడాది జనవరి 29న ఇండియన్ బుల్స్ అనే యాప్ ద్వారా లోన్ పొందే సమాచారం రావడంతో లింక్ కనెక్ట్ చేశాడు. రూ. 10 లక్షల లోన్ కోసం ఆన్‌లైన్‌లో లింక్ ఓపెన్ చేసి సంప్రదించాడు. యాప్ ద్వారా ఖర్చుల నిమిత్తం రూ. 50,927 ఇప్పటి వరకు చెల్లించాడు. యాప్ నిర్వాహకుల నుంచి ఎలాంటి సమాచారం రాకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించి ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్ఐ ఎస్‌కే షాకీర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి



నిందితులను చూపుతున్న పోలీసులు

కొణిజర్ల: కోడి పందేల స్థావరంపై పోలీసులు దాడి చేసి పట్టుకున్న ఘటన ఆదివారం సాయంత్రం కొణిజర్ల మండలం గుబ్బగుర్తి అటవీ ప్రాంతంలో చోటుచేసుకుంది. ఎస్ఐ గుగులోత్ సూరజ్ కథనం ప్రకారం.. గుబ్బగుర్తి అటవీ ప్రాంతంలో ఎన్ఎస్‌పీ కాల్వ సమీపంలో కొందరు కోడి పందేలు నిర్వహిస్తున్నారని సమాచారం అందింది. ఎస్ఐ సూరజ్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని, ఐదుగురు వ్యక్తులు, 15 మోటార్ సైకిళ్లు, ఎనిమిది కోడి పుంజులు, రూ.2 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

ఫెయిలయ్యాననే మనస్తాపంతో డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య

ఖమ్మంక్రైం: డిగ్రీ ఫెయిలయ్యాననే మనస్తాపంతో ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఖమ్మంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ సీఐ ఉదయ్‌కుమార్ కథనం ప్రకారం.. నగరంలోని పెంటగడ్డ బజార్‌కు చెందిన గబ్బుల వీరవెంకట సత్యనారాయణ కూతురు మౌనిక శ్రీ(20) డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతోంది. ఇటీవల ప్రకటించిన సెమిస్టర్ ఫలితాల్లో రెండు సబ్జెక్ట్‌ల్లో ఫెయిల్ కావడంతో మనస్తాపానికి గురైన మౌనిక ఇంట్లో ఈనెల 16న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందు తాగింది. అపస్మారక స్థితిలో ఉండడాన్ని గమనించిన కుటుంబసభ్యులు ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలిచంగా ఆదివారం మృతిచెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.13,828

నివురుగప్పిన నిప్పులా వివాదం

ఐదు దశాబ్దాలైనా అందని ఫల సాయం

- ఐటీడీఏ, సహకార సంఘం అధికారులకు ఫిర్యాదుల వెల్లువ
- నిఘా వర్గాల ఆరా.. మంత్రి తుమ్మల వద్దకు సమస్య..





కోతకు సిద్ధంగా ఉన్న మొక్కజొన్న చేను (ఇన్‌సెట్) గిరిజన సొసైటీలోని కొమరంభీంకాలనీ

సత్తుపల్లి: సత్తుపల్లి మండలం బేతుపల్లి రెవెన్యూలోని ట్రైబల్ జాయింట్ ఫార్మింగ్ కోఆపరేటివ్ సొసైటీ, బి.గంగారం గిరిజన సొసైటీని సమస్యలు వెంటాడుతున్నాయి. మాజీ ఎంపీటీసీ రాజకీయ పలుకుబడితో వివాదాన్ని తమకు అనుకూలంగా సర్దుబాటు చేసేందుకు యత్నిస్తున్నారు. ఇద్దరు కౌలుదారులను కలుపుకొని మధ్యేమార్గంగా ఓ పెద్దమనిషి వద్దకు రామగోవిందాపురం కొమరం భీంకాలనీకి చెందిన గిరిజనులను పంపించి రాజీ కోసం మహిళా గిరిజనులను పిలిచినట్లు తెలిసింది. ఇప్పటికే గిరిజన సొసైటీ భూముల్లో 40 ఎకరాల్లో సాగు చేసి ఉన్న మొక్కజొన్న, పామాయిల్ తోటను రక్షించుకునేందుకు ఆ ఇద్దరు కౌలుదారులు.. గిరిజన మహిళలకు డబ్బు ఆశ చూపి సర్ది చెప్పే ప్రయత్నం చేసినట్లు సమాచారం. తమ భూమిలో వాటాలు తేల్చకుండా ఎట్టి పరిస్థితిలోనూ కౌలుదారులకు సహకరించేది లేదని గిరిజన మహిళలు తెగేసి చెప్పినట్లు సమాచారం. వివాదాన్ని పెద్దది చేసుకుంటే ఇరువర్గాలు నష్టపోతారంటూ సర్దుబాటు చేసే ప్రయత్నాన్ని కొందరు మధ్యవర్తులు తెరపైకి తెచ్చి కౌలుదారులకు నష్టం వాటిల్లకుండా ప్రయత్నాలను ముమ్మరం చేశారు.

డీసీఓ విచారణతో లెక్క తేలుతుంది..

గిరిజన సొసైటీ సభ్యత్వ నమోదుపై జిల్లా సహకార సంఘం అధికారి (డీసీఓ) విచారణ చేస్తే రామగోవిందాపురం కొమరంభీంకాలనీ, గంగారం గట్టుబజార్ గిరిజనుల సభ్యత్వ వివాదంపై ఒక స్పష్టత వస్తుందని గిరిజన సంఘాలు భావిస్తున్నాయి. గిరిజన సొసైటీలో అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు తండ్రి కన్నప్పకు కూడా సభ్యత్వం ఉందని సమాచారం. 40 ఏళ్ల కిందటే భూమిని వదిలేసి వెళ్లిన వారికి గిరిజన సొసైటీలో సభ్యత్వం ఉండదని, వీరి స్థానంలో కొత్తవారిని తీసుకున్నామని ఓ వర్గం గిరిజనులు బలంగా వాదిస్తుండగా.. ఒకసారి సొసైటీ భూముల్లో సభ్యత్వం ఇచ్చిన తర్వాత తొలగించే అధికారం సొసైటీకి లేదని మరోవర్గం గిరిజనులు వాదిస్తున్నారు. గిరిజన సొసైటీలో ఒక కుటుంబానికి ఒక్కరికే సభ్యత్వం ఇవ్వాల్సి ఉండగా.. ఏడుగురికి అదనంగా సభ్యత్వం కల్పించి 17.05 ఎకరాలు, మరో నలుగురు స్థానికేతరులకు సభ్యత్వం ఇచ్చి 10 ఎకరాలకు కౌలు డబ్బులు పంచుతున్నారని, వారసత్వం హక్కులు ఉన్న 16 మంది గట్టుబజార్ గిరిజనులను తొలగించారని ఆరోపిస్తున్నారు. ఇంకో వర్గం గిరిజన మహిళలకు వారసత్వం కింద రావాల్సిన భూమి, కౌలు డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారంటూ వాగ్వాదానికి దిగుతున్నారు. రెండు గిరిజన వర్గాల మధ్య సభ్యత్వ నమోదు, సాంకేతిక కారణాలపై పరస్పరం చేసుకుంటున్న ఆరోపణలకు విచారణతోనే సమాధానం వస్తుందని తెలుస్తోంది.

మంత్రి తుమ్మల దృష్టికి..

రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి గిరిజన సొసైటీ భూ వివాదం ఓ మహిళా మంత్రి ద్వారా వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది. దీంట్లో నిజానిజాలను తెలుసుకునేందుకు స్థానిక నేతలకు సమాచారం అందినట్లు తెలిసింది. అదే విధంగా ఐటీడీఏ, సహకార సంఘం, రెవెన్యూ అధికారులు దీనిపై సమాచారం సేకరిస్తున్నారు. నిఘా వర్గాలు శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా ఎప్పటికప్పుడు జరుగుతున్న పరిణామాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నట్లు సమాచారం.

వివాదం ముదరకముందే..

గిరిజనుల మధ్య భూ వివాదం చినికి చినికి పెద్ద దుమారంగా మారకముందే అధికారులు స్పందించి గిరిజన సొసైటీ భూ సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్ వినిపిస్తోంది. గిరిజనేతరుల మితిమీరిన జోక్యంతో గిరిజనులు పరస్పరం దూషణలు, దాడులతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కౌలుదారులు గిరిజనులను రెండు వర్గాలుగా విభజించి తమ పబ్బం గడుపుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి రాజకీయ అండదండలు కూడా ఉండటంతో గిరిజనులు రెండు వర్గాలుగా విడిపోయి పరస్పరం ఘర్షణ పడేలా వాతావరణం ఉద్రిక్తంగా మారుతోందనే విషయం మాత్రం స్పష్టమవుతోంది. ఐదు దశాబ్దాలుగా సారవంతమైన ఎర్ర మట్టి నేలలు ఉన్న గిరిజనులకు ఇప్పటి వరకు ఫల సహాయం అందలేదు. కౌలుదారులు ఇస్తున్న కొద్ది మొత్తాలతోనే భూయజమానులైన గిరిజనులు కాలం వెళ్లదీస్తున్నారని గిరిజన సంఘాల బాధ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బ్రీత్ ఎనలైజర్ ఫలితాల్లో తేడా



మాట్లాడుతున్న అప్పారావు

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్టీసీ అధికారులు వినియోగిస్తున్న బ్రీత్ ఎనలైజర్ మిషన్లలో సాంకేతిక లోపాలు ఉన్నాయని, వాటి ద్వారా డ్రైవర్ల బ్రీత్‌ను పరీక్షించడం ద్వారా తప్పుడు ఫలితాలు వస్తున్నాయని టీజీఎస్ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పాటి అప్పారావు అన్నారు. ఆదివారం ఖమ్మంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో జరిగిన యూనియన్ ఖమ్మం రీజియన్ కార్యవర్గ సమావేశం ఖమ్మం డిపో కోశాధికారి దామాల లాజర్ అధ్యక్షతన నిర్వహించారు. అప్పారావు మాట్లాడుతూ.. బ్రీత్ ఎనలైజర్‌ను సరైన పద్ధతిలో వాడటం లేదని తెలిపారు. ఆ ఫలితాలతో సిబ్బందిని విధుల నుంచి తప్పించడం అన్యాయమని, పోలీస్ స్టేషన్లలో ఉండే బ్రీత్ ఎనలైజర్‌లను వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో తిమ్మినేని రామారావు, కందుల భాస్కరరావు, అరుణకుమారి, జి.రమేశ్‌బాబు, నజీర్, కేవీ భద్రం, డి.శ్రీనివాసరావు, ఆర్ఎస్ సింగ్, షేక్ నాగుల్ మీరా, బుర్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

సస్పెండైన పీఏసీఎస్ సీఈఓ అరెస్ట్

ఇల్లెందురూరల్: యూరియా విక్రయాల్లో అక్రమాలకు పాల్పడినట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటూ సస్పెన్షన్‌కు గురైన పీఏసీఎస్ సీఈఓ హరిప్రసాద్‌ను అరెస్టు చేసినట్లుగా కొమరారం ఎస్ఐ సోమేశ్వర్ ఆదివారం తెలిపారు. వ్యవసాయ, సహకార శాఖల అధికారుల ఫిర్యాదు మేరకు రెండు రోజుల కిందట కేసు నమోదు చేశామని, ఉన్నతాధికారుల ఆదేశం మేరకు అరెస్టు చేశామని ఎస్ఐ వివరించారు.

పేద విద్యార్థులకు సాయం అందించేందుకు కృషి

నేలకొండపల్లి: వాసవీక్లబ్ ద్వారా పేద విద్యార్థులకు రూ.5 వేల చొప్పున దాదాపు రూ.కోటి వరకు అందించేందుకు కృషి చేస్తున్నట్లు ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఇరుకుల్ల రామకృష్ణ వెల్లడించారు. మండల కేంద్రంలోని వాసవీభవన్‌లో ఆదివారం ఉమ్మడి కేబినెట్ మీటింగ్ నిర్వహించగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న రెండు వేల క్లబ్‌ల ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రతీ క్లబ్ నుంచి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు అందిస్తున్నామన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇప్పటిదాకా రూ.25 లక్షల విలువైన సేవా కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. సమావేశంలో గవర్నర్ గుమ్మడవెల్లి శ్రీనివాస్, గంగిశెట్టి గంగాధర, జగదీశ్‌కుమార్, చిదిరాల లింగయ్య, కడవెండి శ్రీనివాస్, రేగూరి హనుమంతరావు, శివకుమార్, దోసపాటి వెంకటేశ్వరరావు, దారా నర్సింహారావు, రేగూరి వాసవి, దోసపాటి చంద్రశేఖర్, గెల్లా కృష్ణారావు, కొత్తా కరుణ, కొత్తా వెంకటేశ్వరరావు, కొత్తా రమేశ్, కొత్తా రాణి, దోసపాటి నాగేశ్వరరావు, దోసపాటి అచ్యుతరామయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న వాసవీక్లబ్ ప్రతినిధులు

బార్ ఎదుట అంబులెన్స్ !

గంటల తరబడి నిలిచిన 1962



బార్ అండ్ రెస్టారెంట్ వద్ద నిలిపిన అంబులెన్స్

మధిర: మధిర పట్టణంలోని వైరా రోడ్డులో ఉన్న ఒక బార్ అండ్ రెస్టారెంట్ వద్ద గంటల తరబడి ప్రభుత్వ సంచార పశు వైద్యశాలకు చెందిన అంబులెన్స్ వాహనం నిలిచి ఉంది. ప్రతిరోజూ 1962 అంబులెన్స్ వాహనం మధిర ప్రభుత్వ పశువైద్యశాల ఆవరణలో ఉంచుతారు. ఆదివారం అంబులెన్స్ డ్రైవర్ మద్యం సేవించడానికి ఓ బార్ అండ్ రెస్టారెంట్ వద్దకు వాహనాన్ని తీసుకెళ్లి సుమారు నాలుగు గంటల పాటు అక్కడే నిలిపి ఉంచాడు. మధిర నియోజకవర్గం పరిధిలోని 5 మండలాల్లో పశువులకు వైద్య సేవలు అందించే అంబులెన్స్ గంటల తరబడి రెస్టారెంట్ వద్ద నిలిపి ఉంచడాన్ని గమనించిన ప్రజలు ఆశ్చర్యపోయారు. ప్రభుత్వ వాహనాన్ని ఈ విధంగా దుర్వినియోగం చేస్తున్నారని అంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సదరు డ్రైవర్ పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉట్ల పండుగకు వేళాయే..!

నేడు శ్రీకృష్ణ జన్మాష్టమి

- ఐకమత్యానికి ప్రతీక ఉట్లు
- యాదవులకు ప్రత్యేక పండుగ





ఉట్లు కొడుతున్న యువత (ఫైల్)

ఖమ్మంగాంధీచౌక్: ప్రజలు ఎంతో ఉల్లాసంగా జరుపుకునేది ఉట్ల పండుగ. ఈ పండుగకు దేశంలో ఎంతో విశిష్టత ఉంది. శ్రీకృష్ణుని జన్మదినాన్ని హిందువులు పండుగగా జరుపుకుంటారు. దేవకీ వసుదేవుల ఎనిమిదో గర్భంగా శ్రావణ మాసం కృష్ణ పక్షం అష్టమి తిథిన కంసుడి చెరసాలలో శ్రీకృష్ణుడు జన్మించాడని పురాణాలు చెబుతున్నాయి. అందుకే శ్రీకృష్ణ జన్మాష్టమిని ఏటా శ్రావణ మాసం కృష్ణ పక్ష అష్టమి రోజున జరుపుకోవటం ఆనవాయితీ. శ్రీకృష్ణున్ని ఇష్ట దైవంగా భావించే ప్రజలు, భక్తులు సోమవారం ఈ పండగను జరుపుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ రోజు శ్రీమహావిష్ణువు మధురలో కృష్ణుని రూపంలో జన్మించాడని పురణాలు చెబుతున్నాయి. అనంతరం ఆయనను అక్కడి నుంచి గోకులానికి తీసుకువెళ్లారు. అక్కడ శ్రీకృష్ణుని జన్మదిన వేడుకలను అత్యంత వైభవంగా జరుపుకుంటారు. ఈ పడుగను ప్రాంతాల వారీగా శ్రీ కృష్ణాష్టమి, జన్మాష్టమి, గోకులాష్టమి, అష్టమిరోహిణి అనే పేర్లతో పిలుస్తుంటారు. భక్తులు ఉపవాసం పాటిస్తారు. పగలంతా ఉపవాసం ఉండి సాయంత్రం శ్రీకృష్ణున్ని పూజిస్తారు. శ్రావణ మాసంలో లభించే పండ్లు, అటుకులు, బెల్లం కలిపిన వెన్న, పెరుగు, మీగడ స్వామికి నైవేద్యంగా పెడతారు. ఊయల కట్టి అందులో శ్రీకృష్ణ విగ్రహాన్ని పెట్టి ఊపుతూ రకరకాల పాటలు, కీర్తనలు ఆలపిస్తారు. వీధుల్లో, కూడళ్లలో ఎత్తుగా ఉట్లు కట్టి పోటీపడి వాటిని కొడతారు. అందుకే ఈ పండుగను ఉట్ల పండుగ అనికూడా పిలుస్తారు. ద్వాపరయుగంలో జన్మించిన శ్రీకృష్ణుడు నేటి కలియుగానికి ఆదర్శంగా నిలుస్తాడని భక్తుల నమ్మకం. అందుకే ఆయనను ఇష్ట దైవంగా కొలుస్తారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, వివిధ రాష్ట్రాల్లో ఆయా రాష్ట్రాల సంప్రదాయాలతో శ్రీకృష్ణజన్మదిన వేడుకలను జరుపుకోవటం ఆనవాయితీ.

యాదవుల ప్రత్యేక పండుగ

శ్రీకృష్ణుడు అనగానే యాదవులు గుర్తుకు వస్తారు. యాదవులు శ్రీకృష్ణున్ని కులదైవంగా కొలుస్తారు. కృష్ణాష్టమి రోజున ప్రత్యేక పూజలు చేస్తారు. గ్రామాలు, పట్టణాల్లో గోకులాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా జరుపుకుంటారు. తమ పిల్లలను, చిన్నారులను కృష్ణుడు, గోపికల వేషధారణలతో అందంగా అలంకరిస్తారు. కృష్ణుడి ప్రతిమకు ప్రత్యేక పూజలు చేసి అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ముగింపు ఘట్టంగా నిర్వహిస్తారు. సహపంక్తి భోజనాలు చేస్తారు. ఇతర వర్గాలకు చెందిన ప్రజలను కలుపుకొని యాదవులు ఈ పండగను జరుపుకొని స్నేహభావాన్ని, ఐక్యమత్యాన్ని చాటుతారు. గ్రామ, పట్టణ కూడళ్లలో, ఆలయాల వద్ద కుల పెద్ద చేత ఉట్టి కొట్టించటం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఖమ్మం నగరంలోని పలు ప్రాంతాలతో పాటు పలు గ్రామాల్లో యాదవులు ఈ పండగను ప్రత్యేకంగా జరపుకోవటం ఆనవాయితీ.

ఐదు నిమిషాల్లో ఇంటికి చేరాల్సి ఉండగా..

- రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి
- పెదనాన్ననను పరామర్శించి వస్తూ అనంతలోకాలకు..



శివయ్య (ఫైల్)

కల్లూరు: తన పెదనాన్నను ఆస్పత్రిలో పరామర్శించి వస్తూ.. మరో ఐదు నిమిషాల్లో ఇల్లు చేరుతాడనుకున్న సమయంలో ఓ యువకుడిని రోడ్డు ప్రమాదం కబలించింది. కల్లూరులో టీజీఎస్‌రోడ్ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి.. కల్లూరు గోపాలకుంటకు చెందిన గోకరి వీరయ్య, నారాయణమ్మ దంపతుల కుమారుడు శివయ్య (23) శనివారం రాత్రి ఖమ్మంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో తన పెదనాన్న వెంకన్న చికిత్స పొందుతుండగా పరామర్శించి ఆదివారం తెల్లవారుజామున ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. కల్లూరు చేరుకుని, మరికొన్ని నిమిషాల్లో ఇంటికి వెళ్లేబోయే శియ్యను సత్తుపల్లి వైపు నుంచి ఖమ్మం వైపు కొబ్బరి బొండాల లోడుతో వెళ్తున్న బొలేరో వాహనం అతివేగంగా వస్తూ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుబల్లి తరలించారు. బొలేరో వాహనం డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎస్‌కే షాకీర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుమలాయపాలెంలో పట్టపగలే చోరీ

తిరుమలాయపాలెం: ఇప్పటికే మండలంలోని తాళ్ల చెరువులో నగల మెరుగు పేరుతో 6 తులాల బంగారం చోరీ, ఏలువారిగూడెంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైరు చోరీ ఘటనలతో ప్రజలు భయాందోళనలకు గురవుతుండగా శనివారం మధ్యాహ్నం సమయంలో తిరుమలాయపాలెంలో ఓ ఇంట్లో కిటికీ అద్దాలు పగలగొట్టి రూ.80 వేల విలువైన బంగారు నగలు ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. తిరుమలాయపాలేనికి చెందిన జక్కుల భద్రమ్మ ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో స్వీపర్‌గా పనిచేస్తోంది. శనివారం ఉదయం ఇంటికి తాళం వేసి ఖమ్మం వెళ్లి సాయంత్రం ఏడున్నర గంటల సమయంలో ఇంటికి వచ్చి తాళం తీసి చూడగా కిటికీ అద్దాలు పగలగొట్టి బీరువాలోని రెండు జతల బంగారు దిద్దులు 10 గ్రాములు, ఆరుగ్రాముల ఉంగరాలు, 20 తులాల వెండి పట్టీలు ఎత్తుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ జగదీశ్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్ఐ జగదీశ్

బైక్‌ను ఢీకొట్టిన కారు

కామేపల్లి: ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. సింగరేణి మండలం చిన్నమదెంపల్లి గ్రామానికి చెందిన లకావత్ రాములు ద్విచక్రవాహనంపై మర్రిగూడెం నుంచి తాళ్లగూడెం వైపు వెళ్తుండగా పెద్దమ్మతల్లి దేవాలయం సమీపంలో కామేపల్లి నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న కారు ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. రాములుకు తీవ్ర గాయాలు కాగా 108 ద్వారా ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రెండు బైక్‌లు ఢీ..

పెనుబల్లి: ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరు గాయపడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. మండలంలోని సూరయ్యబంజర్ తండాకు చెందిన మూడు నాగేశ్వరరావు వీఎం బంజర్‌కు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. కల్లూరు మండలంలోని లింగాలకు చెందిన కత్తి ఉపేందర్ రాజుగూడెం వైపు వెళ్తున్నాడు. ఇద్దరూ వీఎం బంజర్ శివారులో ఢీకొన్నారు. ఇద్దరూ గాయపడగా వారిని స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు..

నేలకొండపల్లి: మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. పగిడిపత్తి వీరబాబు (45) ఆదివారం బైక్‌పై వస్తుండగా మండలంలోని చెరువుమాధారంలో ఆటోఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన వీరబాబును ఖమ్మం తరలించారు.

50 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

కారేపల్లి : అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఖమ్మం టాస్క్‌ఫోర్స్, కారేపల్లి పోలీసులు ఆదివారం రాత్రి దాడి చేసి పట్టుకున్నారు. మండల పరిధిలోని చెన్నంగులగండ గ్రామంలో ఓ ఇంట్లో ఇల్లెందు పట్టణానికి చెందిన బియ్యం వ్యాపారులు సుమారు 50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని నిల్వ ఉంచారని సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి ఆ ఇంటిని సైతం సీజ్ చేశారు.

గొంతు కోసుకుని యువకుడు మృతి

పాల్వంచ: ఆర్థిక ఇబ్బందులతో పాటు మతి స్థిమితం సరిగా లేక యువకుడు కత్తితో గొంతు కోసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని వెంగళరావుకాలనీకి చెందిన ఎల్.రామకృష్ణ (36) చెప్పులు కుట్టుకుంటూ జీవిస్తున్నాడు. ఆర్థిక పరిస్థితి బాగోలేక మద్యానికి బానిస అయ్యాడు. కొంతకాలంగా మానసిక స్థితి సరిగా లేదు. శనివారం రాత్రి ఇంట్లోకి వెళ్లి కత్తితో గొంతు కోసుకున్నాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. మృతుని తండ్రి, కేటీపీఎస్ రిటైర్డ్ ఉద్యోగి నాగభూషణం ఫిర్యాదు మేరకు ఎస్ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.